

సందడిగా బతుకమ్మ ఆట

ఎటపాక మండలం తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ ఆట సందడిగా జరిగింది. విద్యార్థులు వివిధరకాల పూలతో బతుకమ్మలు తయారు చేసి పాఠశాలకు తీసుకొచ్చారు. వాటిని వరసగా పేర్చి సందడి చేశారు. గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు. **– ఎటపాక, న్యూస్‌టుడే**

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?



మన్యంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ప్రమాదకర రీతిలో ప్రయాణాలు సాగుతున్నాయి. ప్రధానంగా ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మన్యంలో తగినన్ని ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకల కోసం ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అంతర్ల సమీపంలో బుధవారం కనిపించిన దృశ్యమిది... **– చింతపల్లి, న్యూస్‌టుడే**

ఇక్కడా అక్కడా ఆయనే!

సహకారానికి 'సారథ్యం' కరవు..!

ఈనాడు, పాడేరు, న్యూస్‌టుడే, కె.కోటపాడు, ఎలమంచిలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు సారథులు లేకుండా పోయారు. పాలనా వ్యవహారాలన్నింటినీ పర్సన్ ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. మూడు, నాలుగు సంఘాలకు ఒకరే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరి కొరత కారణంగా పీఏసీఎస్‌ల్లో లావాదేవీలపై ప్రభావం పడుతోంది. వ్యవసాయ రుణాల మంజూరులో, సహకార దస్త్రాల కంప్యూటరీకరణకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. వైకాపా హయాంలో ఈ సంఘాలకు ఎన్నికలు జరపకుండా త్రీమెన్ కమిటీలతో సరి పెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్సన్ ఇన్‌ఛార్జిలను వేశారు. ఇటీవల సాగునీటి, చేనేత సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. వాటితో పాటు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 98 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వాటి పరిధిలో 3.89 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రుణాలు అందించడం.. గతంలో పీఏసీఎస్‌ల ద్వారా జరిగిన లావాదేవీలన్నింటిని ఆన్‌లైన్ చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీటికి తప్పనిసరిగా పర్సన్ ఇన్‌ఛార్జి సంతకాలు అవసరం అవుతుంటాయి. మరికొన్ని సంఘాల్లో ఎరువులు, ఇతరత్రా వ్యాపారాలకు అవసరమైన నగదు లావాదేవీలకు వీరు అందుబాటులో ఉండాలి. అయితే ఒక్కో ఇంఛార్జికి మూడు, నాలుగు సంఘాల బాధ్యతను అప్పగించడంతో వారంలో ఒక్కసారి మించి పీఏసీఎస్‌కు రాలేకపోతున్నారు.



కొక్కిరాపల్లి పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది


> మూడు, నాలుగు పీఏసీఎస్‌లకు ఒకే పర్సన్ ఇంఛార్జి
>
> వారితో పనిపడితే దస్త్రాలు పట్టుకుని తిరగాల్సిందే..

> ఇదేంటని అడిగితే 'మీకు తెలియదా?, అక్కడా నేనే.. ఇక్కడా నేనే చూసుకోవాలి.. మీరే అర్థం చేసుకుని నా సంతకాలు అవసరం అనుకుంటే నేనున్నచోటకే దస్త్రాలు, చెక్‌లు తెచ్చివ్వండి.. చూసి పెడతా' అని పీఏసీఎస్ సీఈవోలకు చెబుతున్నారు. ఇలా తిరగడం వల్ల రుణాల మంజూరు ప్రక్రియలోనే కాదు.. దస్త్రాల కంప్యూటరీకరణలోను జాప్యం జరుగుతోందని సంబంధిత సిబ్బందే చెబుతున్నారు.

సహకార సంఘాలకు 2013లో ఎన్నికలు జరగ్గా వాటి కాలపరిమితి 2018తో ముగిసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించింది కానీ సహకార సంఘాలను పట్టించుకోలేదు. తమ పార్టీకి చెందిన నేతలను పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీగా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు (డీసీసీబీ) ఏడుగురితో కూడిన కమిటీ నియమించి బాధ్యతలను అప్పగించింది. కొంతమంది నేతలు బినామీలతో సహకార సంఘాల సొమ్ములను స్వాహా చేశారు. కూటమి సర్కారు కొలువు తీరాక ఈ కమిటీలు పోయి పర్సన్ ఇన్‌ఛార్జులు వచ్చారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలోని 85 సంఘాలను 35 మంది చేతిలో పెట్టారు. ఉదాహరణకు నక్కపల్లి మండలంలో మూడు సంఘాలకు ఒక్కరే ఇన్‌ఛార్జి. అలాగే పాయకరావుపేటలో నామవరం, శ్రీరాంపురం సంఘాలకు ఒక అధికారే ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఎలమంచిలి, చోడవరం, పాడేరు నియోజకవర్గాల్లోను ఇదే తీరు. సంఘాలు ఎక్కువ ఇన్‌ఛార్జులు తక్కువ కావడంతో వారు పనిచేసే సహకార శాఖకు, ఇంఛార్జిగా ఉన్న సంఘాలకు న్యాయం చేయలేకపోతున్నారు. సహకార సంఘాలకు పూర్వవైభవం రావాలంటే ఎన్నికల నిర్వహణ ఒక్కటే మార్గమని అధికారులు చెబుతున్నారు.



ఎన్నికలు నిర్వహించాలి..: పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిపితేనే రైతులకు అన్నిరకాల సేవలు సకాలంలో అందుతాయి. 2013 జనవరిలో తర్వాత ఇంతవరకు ఎన్నికలు జరగలేదు. కూటమి ప్రభుత్వమైన ఈసారి ఎన్నికలు నిర్వహించి సహకార సంఘాలను బలోపేతం చేయాలి.
–కొల్లి శివప్రసాదు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, రొంగలినాయుడుపాలెం



▸▸ రుణాల్లో జాప్యం..: సహకార సంఘాల్లో పాలకవర్గాలు లేక సకాలంలో రుణాలు అందటం లేదు. వ్యవసాయ పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నాం. బయట అప్పులు చేయాల్సి వస్తోంది. అదే పాలక వర్గాలుంటే సమయానికి నిర్ణయాలు తీసుకునే రుణాలు అందేలా చేసేవారు.
–దొగ్గ దేముడు, ఎ.కోడూరు

▸▸ సంఘాలను బట్టి సర్దుబాటు..: అన్ని పీఏసీఎస్‌లు ఒకేలా లేవు.. కొన్నింటిలో చాలా తక్కువ లావాదేవీలు జరుగుతున్నాయి. అలాంటి వాటిని రెండు మూడు సంఘాలకు ఒక పర్సన్ ఇంఛార్జిగా వేశాం. పెద్ద సంఘాలన్నింటికీ ఒక్కొక్కరికే బాధ్యతలు ఇచ్చాం. రుణాల మంజూరులో జాప్యం జరిగినట్లు మాదృష్టికి రాలేదు. కంప్యూటరీకరణకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.
–కిరణ్‌కుమారి, సహకార శాఖ డివిజినల్ అధికారిణి

జాతినేతలకు ఘన నివాళి


పాడేరు, న్యూస్‌టుడే: సత్యం, అహింసలను అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్ కొనియాడారు. బుధవారం గాంధీ, దేశ రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ పోరాటం చిరస్మరణీయమన్నారు. జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, డీఆర్ఓ పద్మావతి, ఏఎస్పీ ధీరజ్, ఎస్.బి. సీఐ అప్పలనాయుడు, మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్

జీఓ నం. 3ను పునరుద్ధరించాలని వినతి

దేవీపట్నం, న్యూస్‌టుడే: జీఓ నం. 3 పునరుద్ధరించేలా ప్రభుత్వం చట్టం చేయాలని ఆదివాసీ ఐకాస నాయకులు బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవికి వినతి పత్రం అందజేశారు. ఆదివాసీ ఐకాస రాష్ట్ర వైస్ ఛైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోయిన తెల్లం నక్షత్రకు, ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన బండారు దుర్గాప్రసాద్‌లకు సీఎం సహాయ నిధి నుంచి సాయం మంజూరు చేయాలని కోరారు. కొండదొరల సంఘం జిల్లా నాయకుడు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసీ ఐకాస రాష్ట్ర కార్యదర్శి భాజపా మండలాధ్యక్షుడు కారం రామన్నదొర, అరగంటి వీరభద్రరెడ్డి, బండారు వీరలక్ష్మి, నడిపూడి భాను శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ ఐకాస నాయకులు

ప్రతి శుక్రవారం శ్రమదానం

పాడేరు, న్యూస్‌టుడే: ఇక నుంచి ప్రతి శుక్రవారం శ్రమదానం చేయాలని, కార్యాలయాలు, పరిసరాలు శుభ్రం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతే సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వెనుక వైపు ఉన్న పొదలు, తుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలను కలెక్టర్ స్వయంగా తొలగించారు. సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, డీపీఆర్ఓ గోవిందరాజులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

★ మన ఊరు బాగు చేసుకోవడానికి మనమే ముందుకు రావాలని, పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. వంజంగి పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేశంలోని 750 గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నారని, అల్లూరి జిల్లాలో ఆరు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నా ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని గుర్తించడానికి ఈ ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులు గతంలో కంటే జరిగిన అభివృద్ధి, అనుభవాలు పంచుకున్నారు. ముందుగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన టీవీ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని వినిపించారు. డీపీవో కొండలరావు, డీఎల్‌పీఓ కుమార్, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ తరపున ఆశిష్ యాదవ్, ఎన్ఐఆర్డీ ప్రతినిధి నాగరాజు, పిరమిడ్ సంస్థ తరపున నారాయణ రెడ్డి, రేష్మ, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పాత్రుడు, సర్పంచి బొంజుబాబు, తహసీల్దార్ త్రినాథ్‌నాయుడు, ఎంపీడీఓ సాయినవీన్ తదితరులు పాల్గొన్నారు.



వంజంగి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో అధికారులు, సర్పంచి తదితరులు

ఆరు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు

జిల్లాలోని ఆరు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. పాడేరు మండలంలోని వంజంగి గ్రామంలో కలెక్టర్ దినేష్‌కుమార్, గొండెలి గ్రామంలో సబ్ కలెక్టర్ శౌర్యమాన్‌పటేల్, గుత్తులపుట్టులో డీఆర్‌డీఏ పీడీ మురళీ, బడిమెల గ్రామంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. హుకుంపేట మండలంలోని గడ్డికించుమండ గ్రామంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ, మొట్టుజోరు గ్రామంలో డ్వామా పీడీ శివయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

డొంకరాయి ఆనకట్టపై మొసలి సంచారం

మోతుగూడెం, సీలేరు, న్యూస్‌టుడే: లోయర్ సీలేరు ప్రాజెక్టు డొంకరాయి ప్రధాన ఆనకట్టపైకి మంగళవారం రాత్రి ఆరడుగుల మొసలి ప్రవేశించింది. ఆనకట్టకు గేట్లు ఉన్న ప్రదేశంలో ఇది హోంగార్డు కంటపడింది. అక్కడే ఉంటే వేటగాళ్లకు చిక్కే ప్రమాదం ఉందని గ్రహించి, ధైర్యం చేసి మొసలి మూతికి తాడు కట్టి తర్వాత జలాశయంలో వదిలిపెట్టారు.



ఉపాధి హామీతో గ్రామాల్లో వసతుల మెరుగు



సున్నంపాడు గ్రామసభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. మారేడుమిల్లి మండలం సున్నంపాడులో బుధవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని కోరారు. ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామ ప్రజల అవసరాలు తీర్చేవిధంగా ఆయా పనులు ఉండాలన్నారు. 2024-25 సంవత్సరానికి ఈ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం సున్నంపాడు గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సున్నంపాడు నుంచి నూరుపూడి వెళ్లే మార్గంలో వాగుపై వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం, సున్నంపాడు సర్పంచి వెలుగూరి చినలచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మడకం అనిల్‌కుమార్, ఎంపీడీఓ ఎ.వీరకిశోర్, ఉపాధి హామీ ఏపీఓ రెడ్డిబాబు, మాజీ సర్పంచి కంగల బాలుదొర తదితరులు పాల్గొన్నారు.

వ్యాను ఢీ.. యువతి మృతి

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ సమీపంలోని రాజధాని కూడలి వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని వెనుక నుంచి వ్యాను ఢీకొట్టడంతో ఓ వివాహిత మృతి చెందింది. డుంబ్రిగుడ మండల కేంద్రానికి చెందిన సాగర రోజా(25) తన భర్త ప్రేమదాస్, ఇద్దరు పిల్లలతో కలిసి బుధవారం ద్విచక్రవాహనంపై అరకులోయ వచ్చి తిరిగి వెళ్తుండగా రాజధాని కూడలి వద్ద వెనుక నుంచి వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోజా తలకి తీవ్రగాయమైంది. కొన ఊపిరితో ఉన్న ఆమెని అరకులోయ ప్రాంతీయ వైద్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి భర్తతో పాటు ఇద్దరు చిన్నారులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అరకులోయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చిన్ని(పాతచిత్రం)

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

అరకులోయ, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు అరకులోయ గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీఎస్ఎన్ మూర్తి బుధవారం తెలిపారు. విజయవాడలో ఈ నెల 3 నుంచి నిర్వహించనున్న 36వ యునెక్స్- సన్‌రైజ్ సబ్ జూనియర్ క్వాలిఫైయింగ్ పోటీలకు అండర్-17 విభాగంలో చంద్రశేఖర్, అండర్-15 విభాగంలో సూర్య ఎంపికయ్యారన్నారు. విద్యార్థుల ఎంపికపై కోచ్ రాజుబాబు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ పీఎస్ఎన్ మూర్తి, కోచ్ రాజుబాబు

బోధనలో వైవిధ్య శోధన



దేశమాత, గాంధీజీ వేషధారణలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కుమడ పంచాయతీ పూలబంద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంతి గిరి బాలల్లో సృజనాత్మకత పెంపునకు కృషి చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో విద్యార్థులతో వేషధారణలు వేయించి వారిలో చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాలలను వేషధారణలో సిద్ధం చేసి జాతిపిత గొప్పతనాన్ని వివరించారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల ప్రత్యేకతను తెలిపేలా విద్యార్థులతో నాటిక ప్రదర్శన చేయించారు.



దుర్గాదేవిగా..

రోడ్డు విస్తరణపై రేకెత్తిన ఆశలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

పాయకరావుపేట ప్రధాన రహదారి నరకానికి నకలులా తయారైంది. రోజురోజుకు పెరిగిపోతున్న ఆక్రమణలతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు వాహనచోదకులు, పాదచారుల సహనానికి పరీక్ష పెడుతోంది.

నక్కపల్లి, ఎస్.రాయవరం, కాకినాడ జిల్లా కోటనందూరు మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు ఏ చిన్న అవసరమైనా తుని, పాయకరావుపేటకే రావాలి. ఆటోలు, బస్సులు, ద్విచక్రవాహన చోదకులతో జంట పట్టణాలు కళకళలాడుతుంటాయి. పట్టణ జనాభా సుమారు 40 వేలకు చేరింది. దక్కన్, హెటిరో పరిశ్రమల ఉద్యోగుల రాకతో పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. కార్పొరేట్ బ్యాంకులు, వస్త్రదుకాణాల మాల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. పట్టణీకరణ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నా పాయకరావుపేట ప్రధాన రహదారి మాత్రం రోజురోజుకు దారుణంగా తయారవుతోంది. పట్టణంలోని గౌతమ్ థియేటర్ కూడలి నుంచి జాతీయ రహదారి 'వై' కూడలి వరకు 14 మీటర్ల వెడల్పున రోడ్డు ఉంది. రహదారులు, భవనాల శాఖ పరిధిలోని ఈ రోడ్డును రెండు వరుసలుగా విస్తరించేందుకు దీన్ని వీఎంఆర్‌డీఏకు బదలాయించారు. ఆ తర్వాత రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు మొదలైన తర్వాత అప్పట్లో రోడ్డు మార్జిన్ వర్తకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పనులు అర్ధంతరంగా నిలిచాయి. ఎన్నికలకు ముందు గత వైకాపా ప్రభుత్వం ఆక్రమణలు తొలగించకుండా 14 మీటర్ల వెడల్పుతో నిర్మించాల్సిన రోడ్డును కేవలం 7 మీటర్లకే సరిపెట్టింది. దీనికోసం రూ.2 కోట్లు వ్యయం చేశారు.



పాయకరావుపేట ప్రధాన రహదారి

ఆక్రమణల విజృంభణ

తక్కువ వెడల్పుతో రోడ్డు వేసి మిగతా స్థలాన్ని వదిలేశారు. ఇదే అదనుగా భావించి రోడ్డును ఆనుకుని ఉన్న వారంతా ఆక్రమణలకు తెరలేపారు. రహదారికి రెండు వైపులా రోడ్డును సిమెంట్‌తో చదును చేసి వ్యాపారాల నిర్వహణ చేపట్టారు. దీంతో ఇరుకైన రోడ్డుపై తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక్కోసారి గంటల తరబడి ఇక్కట్లు తప్పడం లేదు.

✶ ఇటీవల నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రధాన రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. దీంతో పట్టణవాసులు సహా నియోజకవర్గంలో మరోసారి కొంగొత్త ఆశలకు తెరలేచాయి. ట్రాఫిక్ కష్టాలు తీరతాయనే ఆశాభావం వ్యక్తమైంది. అయితే రోడ్డు మార్జిన్ వర్తకుల సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. కూటమి నాయకులు, హోంమంత్రి అనిత దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే పేటవాసుల కల నెరవేరినట్లే.



ఆక్రమణలతో వెడల్పు తగ్గిన రోడ్డు

అందరితో చర్చించి...



పాయకరావుపేట రహదారిని తప్పనిసరిగా విస్తరిస్తాం. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాలంటే రెండు వరుసల దారి వేయాల్సిందే. విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కృషి చేస్తాం. అందరి ఆమోదంతో రహదారికి కొత్తరూపు తీసుకువస్తాం.

– వంగలపూడి అనిత, హోం మంత్రి

మడుగు.. చూసి వెయ్ అడుగు

నర్సీపట్నం 14వ వార్డు పరిధిలోని సుబ్బారాయుడుపాలెంలో గత ప్రభుత్వం నిర్మించిన పక్కా ఇళ్ల కాలనీకి వెళ్లే రహదారి ఇది. తారు రోడ్డు నుంచి చెరువు గట్టు మీదుగా కాలనీకి గతంలో నిర్మించిన మట్టిరోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. చెరువు పోటెక్కిన సమయంలో రోడ్డంతా గోతులు, బురదమయంగా మారింది. పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 56 ఇళ్లున్న ఈ కాలనీలో 15 ఇళ్లలో గృహప్రవేశాలు చేశారు. కానీ రహదారి సదుపాయం సరిగా లేక కాపురాలు ఉండటం లేదు. ఈ రహదారిని కంకర రోడ్డుగా మార్చి కల్వర్టు నిర్మించేందుకు రూ. 25 లక్షలు అవసరమని గతంలో మున్సిపల్ అధికారులు అంచనా వేశారు. సమస్యని కమిషనర్ జంపా సురేంద్ర దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం నుంచి నిధులొస్తే పనులు చేపడతామని తెలిపారు.

– నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే



సుబ్బారాయుడుపాలెం కాలనీకి వెళ్లే మార్గంలో ఇదీ దుర్గతి

పొదుపు మహిళల ఉత్పత్తులకు విస్తృత ప్రాచుర్యం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత ప్రాచుర్యం కల్పించడానికి వీలుగా మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. పెదబొడ్డేపల్లిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో బుధవారం విశాఖ జీవీఎంసీ చెందిన నోడల్ అధికారి బాలశేఖర్ స్వయం సహాయక సంఘాల మహిళలు రూపొందించిన వివిధ రకాల బొమ్మలు, చేతి సంచులు, గిల్ట్ నగలు, దుస్తులు తదితర 50 రకాల ఉత్పత్తులను వివిధ కోణాల్లో ఫొటోలు తీశారు. వీటికి దిల్లీ నుంచి ఆమోదం లభించిన తరువాత ఓఎన్‌డీసీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎవరైనా బుక్ చేసుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తారని బాలశేఖర్ తెలిపారు.



ఫొటోలు తీస్తున్న జీవీఎంసీ నోడల్ అధికారి బాలశేఖర్

ఈదురుగాలులతో కుండపోత వర్షం

ఎలమంచిలిలో కూలిన విద్యుత్తు స్తంభాలు, చెట్లు



రాంనగర్‌లో రోడ్డుకు అడ్డంగా కూలిన స్తంభాలు



ఎలమంచిలి యానాది కాలనీలో విరిగిన స్తంభాలు, నేలకూలిన చెట్లు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో బుధవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగులు హడలెత్తించాయి. గాలుల బీభత్సానికి 12 స్తంభాలు విరిగిపోయాయి. 20కి పైగా చెట్లు రోడ్లపై కూలిపోయాయి. చెట్లు పడి పలు చోట్ల తీగలు తెగిపోయాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఒక్కసారిగా ఈదురుగాలులతో కుండపోతగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంనగర్, యానాది కాలనీ, మెయిన్ బజార్ కాలనీ ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. పలుచోట్ల చెట్లు కార్లు, బైక్‌లపై పడటంతో దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పిడుగులు పడటం వల్ల పలు చోట్ల విద్యుత్తు మీటర్లు, చాలా ఇళ్లలో గృహోపకరణాలు కాలిపోయాయి. గంట వ్యవధిలో మూడు సెంటీమీటర్ల వర్షం కురిసింది. పట్టణం అంధకారంలో చిక్కుకుంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అధికారులతో ఫోన్‌లో సమీక్షించి యుద్ధప్రాతిపదికన కూలిన చెట్లు తొలగించాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి ఈ ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు యంత్రాల సాయంతో నేలకూలిన చెట్లను తొలగించే పనులు చేయించారు. విద్యుత్తు ఏఈ కరాజు ఆధ్వర్యంలో విరిగిన స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు వేస్తున్నారు. గ్రీన్ సిటీ వద్ద 33 కేవీ విద్యుత్తు లైన్‌పై చెట్లు పడటంతో పలుచోట్ల తీగలు తెగిపోయాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు కట్టర్ల సాయంతో కూలిన చెట్లు తొలగిస్తున్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం: ఎంపీ రమేశ్



ఎంపీ రమేశ్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు అండగా ఉండాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సి.ఎం.రమేశ్ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు నేపథ్యంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా గాంధీ జయంతి పురస్కరించుకొని విశాఖ నగరంలోని లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఖాదీ సంతను సీఎం రమేష్ ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీ రమేష్‌తో పాటు కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర సందర్శించారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చోడవరం, న్యూస్‌టుడే: విశాఖ విమానాశ్రయంలో ఎంపీ రమేశ్‌కు చోడవరం మండలం గవరవరం గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాస్ గజమాలతో స్వాగతం పలికారు. ఎంపీ నాయకత్వంలో చోడవరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఎలమంచిలిలో హాల్ట్ ఇవ్వాలి



ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇచ్చేలా కృషి చేయాలని ఎంపీ సీఎం రమేశ్‌కు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ విన్నవించారు. రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులై తొలిసారిగా విశాఖ వచ్చిన ఎంపీని బుధవారం ఎమ్మెల్యే కలిసి ఘనంగా సన్మానించారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు సైతం ఆయనను కలిసి ఎలమంచిలి రైల్వేస్టేషన్ విస్తరణతోపాటు ముఖ్యమైన రైళ్లు ఆపడానికి కృషిచేయాలని కోరారు. రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల కల్పనపైనా శ్రద్ధ తీసుకోవాలన్నారు.

చౌడువాడలో పిచ్చికుక్క స్వైరవిహారం

పది మందికి గాయాలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు మండలం చౌడువాడలో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పదిమందిని గాయపరిచింది. ఈ దాడిలో కొమార త్రిషిక (5), గొలగాని సౌజన్య (4), దుక్క సిద్దు (6)తో పాటు పెద్దలు గాడి వెంకటరమణ, ఉరికిటి మాత, కుంచా రమణకు గాయాలయ్యాయి. వీరంతా చౌడువాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. తీవ్ర గాయాలైన ఉరికిటి మాతను కె.కోటపాడు సామాజిక ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు స్థానికంగా ఉన్న ఆసుపత్రుల్లో చికిత్స పొందారు.

అడవి పంది అడ్డం పడి రైతుకు..

కె.కోటపాడు, న్యూస్‌టుడే: అడవి పంది బైక్‌కు అడ్డంపడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఉదయం పొలం నుంచి పాలను రైతు కొరుబిల్లి శ్రీనివాసరావు బైక్‌పై తెస్తున్నారు. ఈ సమయంలో పంది అడ్డం పడడంతో వాహనం బోల్తా పడి ఇతను గాయపడ్డారు.

వన్యప్రాణాల రక్షణ అందరి బాధ్యత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అటవీశాఖ అధికారి బి.వి.రమణ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవం పురస్కరించుకుని చినగొల్లలపాలెం, పెదగొల్లలపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వల్లే పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యత సాధ్యమన్నారు. గ్రామాల్లోకి వన్యప్రాణులు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వీటిని వేటాడడం నేరం అన్నారు. ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే చాలా రకాల వన్యప్రాణులు అంతరించిపోయాయన్నారు.



చినగొల్లలపాలెంలో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

ఈత కొలనులో మునిగి ఒకరి మృతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కొండకర్ల ఈతకొలనులో ప్రమాదవశాత్తు మునిగి విశాఖలోని గోపాలపట్నం ఆదర్శనగర్‌కు చెందిన పెదపాటి రాజు (39) మృతి చెందారు. అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ కథనం ప్రకారం.. అచ్యుతాపురం సెజ్‌లోని అభిజీత్ కంపెనీలో పనిచేసే కొందరు ఉద్యోగులతో కలిసి బుధవారం రాత్రి కొండకర్లలోని ఒక రిసార్ట్‌కు వచ్చారు. స్నేహితులు ఈతకొలను ఒడ్డున ఉండగా రాజు కొలనులో దిగాడు. కొద్ది సమయం ఈతకొట్టి నీటిలో మునిగిపోయాడు. సరదాగా ఆసనాలు వేస్తున్నాడని స్నేహితులు భావించారు. ఎంతకీ పైకి లేవకపోవడంతో దిగి చూస్తే అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి అక్కడ నుంచి అనకాపల్లి ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. రాజు గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని స్నేహితులు తెలిపారు. మృతుడి తండ్రికి గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు వారు తెలిపారు. స్నేహితులతో సరదాగా గడపడానికి వచ్చి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు పెట్టుకున్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వల్లూరులో గులికల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామీణ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన వివాహిత ఎస్.జ్యోతి (25) అనకాపల్లిలోని ప్రైవేటు మాల్‌లో పనిచేస్తోంది. మంగళవారం రాత్రి తల్లి మందలించిందని మనస్తాపం చెందిన జ్యోతి గులికల మందు తాగింది. ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు పంపారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పిసినికాడ వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. దీనికి సంబంధించి గ్రామీణ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన పాచిలి శ్రీను (32) బైక్‌పై వస్తూ మంగళవారం రాత్రి అనకాపల్లి మండలం పిసినికాడ వద్ద రోడ్డు దాటుతున్న రాజగిరి కాశిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా బుధవారం మృతిచెందాడు.

బంగారు గొలుసు చోరీ

రాంబిల్లి: బంగారం గొలుసు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేంద్ర చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. లాలంకోడూరు గ్రామానికి చెందిన బండారు సుధీర్‌కుమార్ బుధవారం తెల్లవారు జామున నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అతని మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగిలించాడు. లేచిన తరవాత విషయం తెలుసుకుని ఫిర్యాదు చేశాడు.

బొజ్జన్న కొండ అభివృద్ధికి నిధుల సమీకరణ



ఉత్తమ సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులతో సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: బొజ్జన్న కొండ రెండో విడత అభివృద్ధికి కావలసిన నిధులు సమీకరణకు కృషి చేస్తానని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. బొజ్జన్నకొండపై బుధవారం ధ్యానమందిరం, లేజర్, లైట్ సౌండ్ షో కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఎమ్మెల్యేలు, కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మొదటి అంతస్తులో బొజ్జన్న కొండ చరిత్ర తెలిపే విధంగా ఏర్పాటు చేసిన లేజర్ షో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నాటి చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. ఉదయం సమయంలో పర్యాటకులు, విద్యార్థులు తిలకించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ భావితరాలకు బొజ్జన్న కొండ చరిత్ర ఈ లేజర్‌షో ద్వారా సులభంగా తెలుస్తుందన్నారు. మాజీ శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఈ లేజర్ షో ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారని అభినందించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ కొండ వద్ద సదుపాయాలను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్, జేసీ జాహ్నవి, ఆర్డీఓ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డిగూడెంలో బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన ఓం శ్రీకాశీవిశ్వేశ్వర నిత్యాన్నదాన సమితి ఆధ్వర్యంలో 150 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, వస్త్రాలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కాలేపు రామచంద్రరావు, బీరక ప్రకాశ్‌రావు మాట్లాడుతూ సాయాన్ని బాధిత కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ములకాల సత్యకుమార్, ఆనంద్, సూర్యచంద్రరావు, అల్లంకి నాగేశ్వరరావు, సురేశ్, వీరభద్రం, రాధాకృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: చింతూరు శబరిఒడ్డులోని 150 మంది వరద బాధితులకు, వరరామచంద్రపురం మండలంలోని వచిడ్డగూడెంలో 300 కుటుంబాలకు సైతం సహాయం అందజేశారు.



బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు అందిస్తున్న దాతలు

గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి



గ్రామసభలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ

హుకుంపేట, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ పిలుపునిచ్చారు. జీకే మండ పంచాయతీ కేంద్రంలో బుధవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొని పంచాయతీ సమస్యలు, గ్రామ అభివృద్ధికి అంశాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు స్థానిక నాయకులకు తెలుస్తాయని, వాటిని అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: సాంకేతిక మరమ్మతుల కారణంగా ఈనెల 4వ తేదీన గూడెంకొత్తవీధి, పెదబయలు మండలాల పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ అప్పారావు తెలిపారు. గూడెంకొత్తవీధి మండల పరిధిలోని గూడెం, పాతవీధి, గుమ్మర్లగొంది, పెదబయలు మండలం అడుగులపుట్టు, లక్ష్మీపేట, రూఢకోట, బూసిపుట్టు సబ్ స్టేషన్ల పరిధిలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ముగిసిన సాయిబాబా జయంతి వేడుకలు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో షిర్డీ సాయిబాబా జయంతి వేడుకలు బుధవారంతో ముగిశాయి. గత నెల 28 నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

కూటమి ప్రభుత్వంతో గ్రామ స్వరాజ్యం



రేఖపల్లిలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన సర్పంచి, జడ్పీటీసీ సభ్యుడు

వరరామచంద్రాపురం, ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ గ్రామ స్వరాజ్యం వచ్చిందని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంచాయతీలకు విడుదలవుతున్న నిధులే ఇందుకు నిలువెత్తు నిదర్శనమని వరరామచంద్రాపురం జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, రేఖపల్లి సర్పంచి పూనెం సరోజిని అన్నారు. రేఖపల్లి సచివాలయ పరిధిలో బుధవారం గాంధీజీ జయంతిని పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ముందుగా బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యదర్శి శివప్రసాద్, పూనెం సత్యనారాయణ, రాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఎటపాక మండలం గన్నవరం సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికులను స్థానిక ప్రజా ప్రతినిధులు, తెదేపా నాయకులు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు కంటే రాజు, సర్పంచి గడ్డం భద్రమ్మ, తెదేపా సీనియర్ నాయకుడు బొల్లా పుల్లయ్య పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సర్పంచి జి.లక్ష్మీదుర్గ, ఎంపీడీఓ ఎల్.యాదగిరీశ్వరరావు అన్నారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా బడదనాంపల్లిలో బుధవారం ర్యాలీ చేశారు. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన బస్సు



మొరాయించిన బస్సు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వెళ్తూ బుధవారం సాయంత్రం మార్గమధ్యలో నిలిచిపోయింది. దసరా పండగ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో వివిధ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు తమ స్వగ్రామాలకు పయనం అయ్యారు. విలీన మండలాలకు చెందిన 60 మంది వరకు ఈ బస్సులో వెళ్తున్నారు. బస్సు మారేడుమిల్లి వచ్చేసరికి మొరాయించింది. వెనుక వచ్చిన మరో బస్సులో సగం మందిని ఎక్కించి పంపించారు. మిగిలిన వారు మాత్రం అలాగే ఉండిపోవాల్సి వచ్చింది. ఫలితంగా ప్రయాణికులు ఆర్టీసీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతట్టు గ్రామాలతోపాటు ఘాట్‌రోడ్డులో ప్రయాణించే బస్సులకు సరైన నిర్వహణ లేకపోవడంతోనే ఇటువంటి దుస్థితి ఏర్పడుతోందని అంటున్నారు.



ప్రయాణికుల ఎదురుచూపులు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



జి.మాడుగులలో సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పంచాయతీ కార్యదర్శి రమాశంకర్ అన్నారు. జి.మాడుగుల మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు విజయకుమారి బుధవారం ప్రారంభించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలు, వ్యాపారులకు సూచించారు. పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం గాంధీజీ జయంతిని నిర్వహించారు. సాడేకు సచివాలయం సిబ్బంది నవీన్, తరుణ్‌కుమార్, చిన్నతల్లి, ఉషశ్రీ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: సంకాడ సంపద వృద్ధి కేంద్రంలో 8 టన్నుల వర్మీకంపోస్ట్‌ను ఉత్పత్తి చేశారని ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. సంకాడలో రైతులకు ప్రత్యేక అధికారి, అర్అండ్‌బీ డీఈఈ బాలసుందరబాబుతో కలిసి బుధవారం వర్మీకంపోస్ట్‌ను పంపిణీ చేశారు. సర్పంచి నాగులమ్మ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు, ఏపీవో అప్పలరాజు, కార్యదర్శి అరుణ్, తెదేపా నాయకుడు మామిడి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు ప్రశంసాపత్రాలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన్‌మన్ యోజన్‌లో భాగంగా పీవీటీజీ గ్రామాలకు విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు సహకరించిన సర్పంచులకు బుధవారం ప్రశంసపత్రాలు అందజేశారు. గాంధీ జయంతి రోజున విద్యుత్తు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు.. జి.మాడుగుల సర్పంచి రాంబాబుకు, స్థానిక ఏఈ రమణ.. కోరాపల్లి సర్పంచి ఎం.రాజులమ్మకు ప్రశంసపత్రాలు ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యురాలు విజయకుమారి, ఎల్ఐ షాజహాన్, పంచాయతీ కార్యదర్శి రమాశంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి



చిట్టిబాబు (పాత చిత్రం)

పాడేరు, న్యూస్‌టుడే: మినుములూరు పంచాయతీ కాంగుగెడ్డ గ్రామంలో గిరిజన విద్యార్థి మంగళవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పాంగి చిట్టిబాబు(8) కిండంగి ఎంపీపీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యం పాలయ్యారని ఉపాధ్యాయులు బంధువులకు సమాచారం అందించి గ్రామానికి తరలించారు. తల్లిదండ్రులు బాలుడిని పాడేరు జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందాం

వరరామచంద్రాపురం: ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందామని దళిత సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య పిలుపునిచ్చారు. బుధవారం మాదిగల ఐక్యత ఆత్మగౌరవ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, గురిజాల వెంకటేశ్వర్లు, వెంకట్, గడ్డం వెంకటేశ్, సాలయ్య, తెదేపా నాయకులు ముత్యాల రామారావు, నరేశ్, నరసింహారావు, ఆచంట శ్రీను, సర్వరాజు, రమేశ్, సరోజిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	110	104
లైవ్	132	124
డ్రెస్‌డ్	191	218
స్కిన్‌లెస్	218	228

శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి



పాడేరులో గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్థులు

పాడేరు పట్టణం, సీలేరు, న్యూస్‌టుడే: పాడేరు పట్టణంలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో గురువారం నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక బృంద సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను బుధవారం విడుదల చేశారు. రాజ రాజేశ్వరి అమ్మవారికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం తెలిపారు. అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శన మివ్వనున్నారు. పాడేరు మెయిన్ రోడ్డు పాత సుపత్రి సమీపంలో దుర్గాదేవి ఉత్సవాలను నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు వీఎంవీ సత్యనారాయణ, శ్రీను తెలిపారు. సీలేరులో వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత 33 సంవత్సరాలుగా ఇక్కడ వేడుకలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం అమ్మవారి కలశస్థాపన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: దసరా వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని దుర్గాదేవి, గ్రామ దేవతల ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరించారు. రాజవొమ్మంగిలో దుర్గమ్మ, నూకాలమ్మ, దూసరపాము, లబ్బర్తి, కిండ్ర, వట్టిగెడ్డ, చెరుకుంపాలెం, బడదనాంపల్లి, చికిలింత, కొండపల్లి, శరభవరం తదితర గ్రామాల్లో దుర్గమ్మ ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నారు.



దూసరపాములో విద్యుత్తు దీపాలంకరణలో దుర్గమ్మ ఆలయం

పేదల చదువుకు పెద్ద మనసుతో అండ

భవన నిర్మాణానికి పూర్వ విద్యార్థుల సహకారం



టొంగికోటలో ఐఐటీ హైదరాబాద్ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన పాఠశాల భవనం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

చదువంటే వారందరికీ ప్రాణం. ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలనేది వారి తపన. మంచి చదువులు చదివి దేశవిదేశాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్న ఆ యువకులంతా హైదరాబాద్ ఐఐటీ పూర్వ విద్యార్థులు. చెట్టు పడి పాఠశాల భవనం కూలిపోవడంతో చదువుకు దూరమైన విద్యార్థులకు పాఠశాల భవనం నిర్మించేందుకు వారందరూ చేయి చేయి కలిపారు. పాఠశాలకు వసతి సమకూర్చారు.

ముంచంగిపుట్టు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్ ఐఐటీ హైదరాబాద్ పూర్వ విద్యార్థి. ఆయనతోపాటు ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐఈఎస్ సర్వీసుల్లో ఉన్న సాయితేజ, సౌమిత్‌రాజ్, హరనాథ్‌లతోపాటు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న 23 మంది కలిసి చదివారు. వీరంతా ఎంపీడీఓ కిరణ్‌కుమార్ చొరవతో రూ.2 లక్షలు వెచ్చించి పాఠశాలకు వసతి కల్పించారు.

ఎంపీడీఓ చొరవతో..

ముంచంగిపుట్టు మండలం వనబసింగి పంచాయతీ టొంగికోట గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనంపై వర్షాలకు చెట్టు కూలింది. భవనం నేలమట్టమైంది. విద్యార్థులకు వసతి కరవైంది. దీనిపై ఎంపీడీఓ తన స్నేహితులు, పూర్వ విద్యార్థులతో చర్చించారు. గిరిజన ప్రాంతంలో పేద విద్యార్థుల చదువుకు భవనం నిర్మించేందుకు సహకారం కోరారు. పూర్వ విద్యార్థుల సాయంతో టొంగికోట పాఠశాలకు వసతి సమకూరింది. మరిన్ని నిధులు సమకూరుతున్నాయని, ఇతర సేవా కార్యక్రమాలు చేపడతామని ఎంపీడీఓ తెలిపారు.



ఎంపీడీఓ కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సుభద్ర, గ్రామస్థులు

భవనం ప్రారంభోత్సవం

టొంగికోట గ్రామంలో ఐఐటీ హైదరాబాద్ పూర్వ విద్యార్థుల సాయంతో నిర్మించిన పాఠశాలను గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, ఎంపీపీ సీతమ్మ, సర్పంచి లక్ష్మణ్, మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి సమక్షంలో బుధవారం ప్రారంభించారు. ఎంపీడీఓ కిరణ్‌కుమార్‌ను అభినందించారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంపీడీఓను సత్కరించారు.

లాటరీ పద్ధతిలో 11న మద్యం దుకాణాల ఎంపిక

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో మద్యం దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం వరకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని రంపచోడవరం ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీధర్ తెలిపారు. బుధవారం రంపచోడవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి పాడేరు వీఆర్ వంక్షన్ హాల్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

సీతాఫలం ధరకు రెక్కలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నం, డముకు వారపు సంతల్లో బుధవారం సీతాఫలాలకు అధిక ధర పలికింది. ఒక కావిడి పండ్లు రూ.3 వేల వరకు ధర పలికింది. మైదాన ప్రాంతం నుంచి వ్యాపారులు అధికంగా రావడంతో ధర భారీగా పెరిగింది. రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



సంతకు తీసుకొచ్చిన సీతాఫలాల కావిళ్లు

అవీ ఇవీ

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గుంటసీమ పంచాయతీ సరియవలసలో బీటీ రోడ్డు నిర్మాణానికి సర్పంచి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. మారుమూల గ్రామాల్లో శాశ్వత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఆనందదాయకమన్నారు. తెదేపా పంచాయతీ ఇన్‌ఛార్జి జక్కయ్య, నాయకులు బాలాజీ పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం

కొయ్యూరు, న్యూస్‌టుడే: మర్రివాడ పంచాయతీ బలభద్రం గ్రామంలోని వందమంది పేద ఆదివాసీ గిరిజనులకు 'అడవి బిడ్డలకు అన్నదానం' పేరిట డీటీ దుమంతి సత్యనారాయణ బుధవారం అన్నసంతర్పణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పేదవాడికి అన్నం పెట్టడంలో చాలా సంతృప్తి ఉంటుందన్నారు. డి.రామకృష్ణ, పి.అరవింద్, ఓంకార్, ప్రమోద్ పాల్గొన్నారు.

పిడుగు పడి ఆవు మృతి

హుకుంపేట, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. రంగశీల సమీపంలో పిడుగులు పడ్డాయి. గ్రామానికి సమీపంలో కొండపై మేతకు వెళ్లిన ఆవులకు సమీపంలో పిడుగు పడటంతో కుమడ సీతారాంకు చెందిన ఒక ఆవు చనిపోయింది.

30 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

అడ్డతీగల, న్యూస్‌టుడే: దుప్పులపాలెం శివారున 30 లీటర్ల సారాతో రాయపల్లికి చెందిన పి.సూర్యారావును బుధవారం అరెస్టు చేసినట్లు అడ్డతీగల ఎస్సై వినోద్ తెలిపారు. అతని వద్ద నుంచి సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంగరాజు సేవలు ఎనలేనివి

ఎటపాక, న్యూస్‌టుడే: దివంగత సీపీఐ రాష్ట్ర నేత కందుకూరి మంగరాజు ఆశయాలను నెరవేర్చాలని గన్నవరం సర్పంచి గడ్డం భద్రమ్మ అన్నారు. మంగరాజు జయంతి సందర్భంగా బుధవారం గ్రామంలోని స్తూపం వద్ద నివాళులర్పించారు. సర్పంచి మాట్లాడుతూ పార్టీకి ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. సీపీఐ నాయకులు సత్యరాజు, గడ్డం వెంకటేశ్వర్లు, అలవాల తిరుపతిరాజు పాల్గొన్నారు.

శాంతిమార్గంలో నడవాలి

ఎటపాక, న్యూస్‌టుడే: క్రైస్తవులు శాంతి మార్గంలో నడుస్తూ సమాజానికి ఆదర్శంగా ఉండాలని రాజమహేంద్రవరం బైబిల్ వండర్స్ వ్యవస్థాపకులు జాన్‌వెస్లీ అన్నారు. ఎటపాక మండలం మేడువాయి గ్రామంలోని యేసుక్రీస్తు సియోను మినిస్ట్రీస్ చర్చి వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి అందరికి పంచారు. పాస్టర్ నవీన్ లాజరస్, హెప్సీబ లాజరస్, ప్రమీలారాణి, స్టీవెన్, రవి కాంత్, గిద్యోను, తిమోతి పాల్గొన్నారు.

నూతన మద్యం విధానంపై నిరసన

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం విధానంపై బుధవారం గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముంచంగిపుట్టులోని కల్యాణ మండపం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే గ్రామాల్లో బెల్టుషాపులు పెరిగిపోతాయన్నారు. మహిళలపై దాడులు పెరుగుతాయని ఐద్వా మండల అధ్యక్షురాలు ఈశ్వరి, కార్యదర్శి విజయ అన్నారు. ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం నాయకురాలు రాద, దొసుదా, ఈశ్వరి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తి సజీవం



చింతూరులో గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రంపచోడవరం, చింతూరు, న్యూస్‌టుడే: గాంధీజీ పోరాటస్ఫూర్తి సజీవమని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని రంపచోడవరం అంబేడ్కర్ కూడలి వద్ద ఉన్న జాతిపిత విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. మండల తెదేపా అధ్యక్షుడు కారం సురేష్, బాపిరాజు, నిరంజనీదేవి, అనంతమోహన్ పాల్గొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో జాతిపిత చిత్రపటానికి ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం నివాళులు అర్పించారు. చింతూరులో డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధర్యంలో బస్టాండ్ ఆవరణలోని చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ రత్న మాణిక్యం, అధ్యాపకులు శకుంతల, పద్మ, హారతి పాల్గొన్నారు.

అరకులోయ/పట్టణం: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అరకులోయ ప్రాంతీయ వైద్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కౌన్సిల్ సభ్యులు రత్నరాజు, రాజేష్, కళావతి, ద్రౌపది తదితరులు పాల్గొన్నారు. అరకులోయ మ్యూజియం ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎంపీపీ ఉషారాణి, జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి నివాళి అర్పించారు.

ముంచంగిపుట్టు, గూడెంకొత్తవీధి, సీలేరు, అనంతగిరి గ్రామీణం: ముంచంగిపుట్టు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర నివాళులు అర్పించారు. ఎంపీపీ సీతమ్మ, ఎంపీడీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. జీకేవీధి, దేవరాపల్లి, సంకాడ సచివాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర్‌బాబు, ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. సీలేరులో పారిశుద్ధ్య కార్మికులను సర్పంచి దుర్జో, నేతలు సత్కరించారు. స్వచ్ఛభారత్ దివస్ ర్యాలీలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాస్‌కుమార్ పాండే, ఉపసర్పంచి కె.వల్లీప్రసాద్ పాల్గొన్నారు. కొత్తూరు సచివాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ నివాళి అర్పించారు. తెదేపా మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు, ఆనంద్, సర్పంచి సారా సీతయ్య పాల్గొన్నారు.



కొత్తూరులో నివాళి అర్పిస్తున్న కిడారి తదితరులు



సంకాడలో..

అంచుకెళ్తే అంతే!



బురదగెడ్డలో కోతకు గురైన వంతెన అంచులు

డుంబ్రిగుడ పోలీసు స్టేషన్ పరిధిలోని బురదగెడ్డ ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వంతెన అంచులు కొట్టుకుపోయాయి. అరకు- పాడేరు ప్రధాన రహదారిలోని ఈ వంతెన రోడ్డు కోతకు గురవ్వడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. గతంలో కోతకు గురైన అంచుల్లో మట్టి పోసి చదును చేశారు. వర్షాలతో అంచులు కోతకు గురై కొట్టుకుపోయాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

– డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

మెగా వైద్య శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఇందుకూరుపేటలో జన సైనికులు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి రోగులు పోటెత్తారు. ఎమ్మెల్యే శిరీషాదేవి ప్రారంభించారు. సుమారు 300 మంది రోగులకు వైద్య సేవలందించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుర్ల రాజశేఖర్ రెడ్డి, డి.భారతి పాల్గొన్నారు.

కూనవరం: ఓంకార్ ట్రస్టు ఆధ్వర్యంలో శబరికొత్తగూడెంలో వైద్య శిబిరం నిర్వహించారు. కూనవరం ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజీవ్ సిబ్బందితో కలిసి గ్రామంలోని 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పర్యవేక్షకుడు శ్రీనివాస్, సీత, వైష్ణవి, వెంకటేశ్వర్లు, శశికళ పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా లేక ఇక్కట్లు



చింతరేవుపల్లి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతుల నిరసన

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరదల్లో కారణంగా దెబ్బతిన్న త్రీఫేజ్ విద్యుత్తు లైన్లను పునరుద్ధరించాలని చిన్నమట్టపల్లి సర్పంచి పిట్టా రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని గున్నంకొండ మీదుగా చింతరేవుపల్లి వచ్చే త్రీఫేజ్ విద్యుత్తు లైన్లు, ముంపునకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా లేక రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటం జయరాజు, దుర్గారావు, బాలరాజు, హరీశ్, శంకర్, రమేశ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పరిమితంగానే రాకపోకలు



బుధవారం సీలేరు వచ్చిన ఆర్టీసీ బస్సు

సీలేరు, న్యూస్‌టుడే: గత నెల 8న కురిసిన భారీ వర్షానికి సీలేరు ప్రాంతానికి రద్దు చేసిన ఆర్టీసీ సర్వీసులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించలేదు. బుధవారం నుంచి కేవలం రెండు బస్సులు మాత్రమే పునఃప్రారంభించారు. బస్సులు పూర్తిస్థాయిలో తిరగకపోవడంతో ఈప్రాంత ప్రయాణికుల కష్టాలు తీరడం లేదు. వర్షాలతో గూడెంకొత్తవీధి నుంచి సీలేరు రహదారిలో కొండచరియలు విరిగిపడి, రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం రహదారిని బాగు చేసినా ఆర్టీసీ బస్సులన్నీ తిప్పడం లేదు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సర్వీసులను తిప్పాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో సంతబయలు శివాలయం సమీపంలో బుధవారం ఓ వ్యాన్ నిలిచిపోయింది. నిర్మాణ పనులతో రోడ్డంతా బురదమయంగా మారింది. బురదలో టైర్లు కూరుకుపోవడంతో వాహనం నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు గంట తరువాత జేసీబీ సహాయంతో బయటకు తీశారు.



బురదలో కూరుకుపోయిన వ్యాన్

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

రంపచోడవరం, మోతుగూడెం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది అక్టోబర్ 2న పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం సర్పంచి మంగా బొజ్జయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ జరిగింది. సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు ఉలవల లక్ష్మి, ఖాజావలి పాల్గొన్నారు. వై.రామవరం మండలం డొంకరాయి సచివాలయంలో గ్రామసభకు వివిధ గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్థులు 300 మందికిపై పైగా హాజరయ్యారు. ప్రజలు తమ గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచి వేమ సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ హామీ ఇచ్చారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు 235 పక్కా గృహాలు మంజూరు అయ్యాయని చెప్పారు. అబ్బాయిరెడ్డి, కొర్నా మోహన్‌రావు, పల్లాల సన్యాసిరెడ్డి, వీఆర్వో సందీప్ పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గాంధీజీ కలలు కన్న స్వరాజ్య స్థాపనకు కృషి చేద్దామని సర్పంచి వెంకటరావు అన్నారు. డుంబ్రిగుడలోని పోతంగి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి విజయ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. ఎంపీటీసీ సభ్యురాలు గీత, తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఉప సర్పంచి జగ్గునాయుడు, వార్డు సభ్యులు, తెదేపా నాయకులు సింహాద్రి పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచి పుష్పలత ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 2025-26 సంవత్సరంలో నిర్వహించనున్న ఉపాధి హామీ పనులను గుర్తించినట్లు జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. రైతులకు కావాల్సిన పనులను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం స్వచ్ఛతే సేవా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, విజయలక్ష్మి, నాజర్‌వల్లీ, కూటమి నాయకులు ఆనంద్, నాగభూషణం, బుజ్జిబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.



రంపచోడవరంలో మాట్లాడుతున్న సర్పంచి బొజ్జయ్య

ఏకలవ్య పాఠశాలల్లో మెరుగైన విద్య



మజ్జివలసలో శిలాఫలకం ఆవిష్కరణలో తెదేపా నేత దొన్నుదొర, జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి తదితరులు

హుకుంపేట, అరకులోయ, అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మత్స్యలింగం పేర్కొన్నారు. నక్కలపుట్టు గ్రామంలో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేపట్టారు. గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఎంపీపీ రాజబాబు, ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ ఉజ్వల్, ప్రభాకర్, ఎంఈవో చెల్లయ్య, తెదేపా నాయకులు తులసీరావు, లక్ష్మణుడు, వెంటకరమణరాజు తదితరులు పాల్గొన్నారు. అరకులోయ మండలం బొండాం పంచాయతీ మజ్జివలసలో రూ.21 కోట్లతో నిర్మించిన ఏకలవ్య భవనం ప్రారంభోత్సవం జరిగింది. జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, ఎంపీపీ ఉషారాణి, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి దొన్నుదొర, బొండాం పంచాయతీ సర్పంచి భాస్కరరావు, గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు. అనంతగిరి పంచాయతీ పాతకోట గ్రామంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూమిపూజలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ సోమెల రూతు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరి విద్యార్థులకు ఉత్తమ విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. చింతపల్లిలో రూ.44 కోట్ల నిధులతో నిర్మించిన ఏకలవ్య పాఠశాల ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచి దురియా పుష్పలత, డీడీ రజని, వైస్ ప్రిన్సిపల్ జయంతి హరి, ఎంపీటీసీ సభ్యులు దారాలక్ష్మి, విజయలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

★ ఈ నెల 3వ తేదీన అరకులోయలోని ఏకలవ్య పాఠశాలలో జరిగే కల్చరల్ ఫెస్ట్ 2024-25లో పాల్గొనేందుకు కొయ్యూరు ఏకలవ్య పాఠశాల విద్యార్థులు బయలుదేరారని ప్రిన్సిపల్ సతీష్‌కుమార్ తెలిపారు. చింతపల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో నడుస్తున్న కొయ్యూరు పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు అరకులోయ బయలుదేరారన్నారు. పర్యవేక్షకుడు శ్యామ్‌కుమార్, తమ్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతపల్లిలో ఏకలవ్య భవనం ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570,
అరకులోయ 63034 86346,
రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: రంపచోడవరం మండలం పందిరిమామిడి నుంచి ఇర్లపల్లి వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. రోడ్డుకు ఇరువైపులా అంచులు సరిచేయాలి. – కె.శివాజీ, ఇర్లపల్లి

✓: ఇటీవల వర్షాల కారణంగా పలు రోడ్లు కోతకు గురయ్యాయి. అన్నింటికి మరమ్మతులు చేయించడంతోపాటు అంచులు సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.
– ప్రదీప్, ఏఈ, ర.భ. శాఖ, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలసలో రైతు సేవా కేంద్ర భవన నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది.
– అరగాటి రామిరెడ్డి, జీఎంవలస

✓: భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపడతాం.
– వీరకిశోర్, ఎంపీడీఓ, మారేడుమిల్లి

ఉద్యోగాల కల్పనలో అన్యాయం

మోతుగూడెం, న్యూస్‌టుడే: ఉద్యోగాల కల్పనలో అన్యాయానికి గురైన తమకు జెన్‌కో అధికారులు తమకు న్యాయం చేయాలని మోతుగూడెం పంచాయతీలోని ఒడియాక్యాంపు, ఫోర్‌బే, ఇంతులూరువాగు గ్రామాల గిరిజనులు కోరారు. మోతుగూడెంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొన్నాళ్ల క్రితం తామంతా జెన్‌కోలో పీస్ వర్క్ కింద పని చేశామని, రాజకీయ ప్రభావం వల్ల తమను పనిలో నుంచి తొలగించారన్నారు. కానీ ఇటీవల సంస్థలో ఏడాది కూడా పనిచేయని వాళ్లని పీస్ వర్క్ నుంచి గుత్తేదారు కార్మికులుగా తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను గుత్తేదారు కార్మికులుగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వంతల ప్రసాద్, కొరా జగబంధు తదితరులు పాల్గొన్నారు.



న్యాయం చేయాలని కోరుతున్న గిరిజనులు

వైద్యశాలల స్థాయి పెంపునకు ప్రతిపాదనలు



డీసీహెచ్ఎస్ కృష్ణారావుకు వినతిపత్రం అందిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం, చింతూరు వైద్యశాలల స్థాయి పెంపునకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని డీసీహెచ్ఎస్ కృష్ణారావు ఆదేశించారు. ఈ ఆసుపత్రులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. కూనవరంలో 30 పడకల నుంచి 50 పడకలకు, చింతూరులో 50 పడకల నుంచి 100 పడకల స్థాయికి పెంచేందుకు ప్రతిపాదనలు పంపాలని రెండు ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మహేశ్ బాబు, కోటిరెడ్డికి చెప్పారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భద్రతా సిబ్బంది తమకు వేతనాలు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయనకు వినతిపత్రం అందించారు. వైద్యులు తేజ, వివేక్‌నాయక్, ప్రజ్వల, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి జమాల్ బాషా సూచించారు. గిరిజన ప్రాంతంలో మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. టొయోటాస్ రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ సుమారు రూ.7 లక్షల రూపాయలు వెచ్చించి సమకూర్చిన 20 వేల దోమ తెరలను గిరిజనులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని వనుగుపల్లి పంచాయతీ చింతగున్నలు, వరంకుర, చీడిపాలెం గ్రామాల్లో బుధవారం ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి సింహాద్రి, ఆరోగ్య పర్యవేక్షకురాలు వరలక్ష్మి పాత్రో, ఝాన్సీ, ఆరోగ్య సహాయకులు ఎలీషారావు, నాగరాజు, లక్ష్మణ్‌రావు, భీమన్న దొర, కె.వి.వి ఆర్.కె మూర్తి, స్వర్ణలత, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా, వైద్య సిబ్బంది